నిధుల్లేక నీరసించిన జీపీలు

- నిలిచిన విద్యుత్, ట్రాక్టర్ బిల్లులు, కార్మికుల వేతనాలు
- బకాయిల భారంతో పంచాయతీలు సతమతం
- నిధుల లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సర్పంచ్‌లు



దోమకొండ : పల్లె ప్రగతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లా అగ్రభాగాన నిలిచింది. కాని వీటి నిర్వహణలు పంచాయతీలకు భారంగా మారాయి. పంచాయతీలకు పచ్చదనం, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన, ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతివనం, వైకుంఠ ధామాలు, వర్మికంపోస్టు షెడ్‌లు, తదితర నిర్మాణాలు చేపట్టారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా 525 గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ, హరితహారం మొక్కలకు నీటిని అందించడానికి ప్రభుత్వం ట్రాక్టర్లను అందించింది. ప్రతినెలా అందించే వివిధ ఆర్థిక సంఘాల నిధులు రాకపోగా, వచ్చే నిధులు బకాయి ల చెల్లింపులతో పంచాయతీలకు భారంగా మారింది.

తడిసి మోపెడు..

పల్లెలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిధులు తప్ప ఇతర వనరులు లేవు. దీంతో వచ్చిన నిధుల్లో ట్రాక్టర్ కొనుగోలు కిస్తులు కట్టడం, డీజిల్ వ్యయం, మరమ్మతులు, పంచాయతీ కార్మికులు వేతనాల చెల్లింపులు, తదితర వాటికి సరిపోతున్నాయి. వీటికి తోడు విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ఆర్థిక సంఘం నిధులు నెలవారిగా రాకపోవడం, చిన్న పంచాయతీలకు వచ్చే ఆదాయం కన్నా చెల్లింపులు ఎక్కువగా ఉంటున్నాయి. కొత్త పంచాయతీ చట్టంలో సర్పంచ్‌ల బాధ్యతలు కీలకంగా మారాయి. అదీగాక ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీలో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, కంపోస్టుషెడ్‌ల నిర్మాణాలు చేపట్టారు. వీటి నిర్మాణాల పురోగతిని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకువచ్చి మరీ పనులు పూర్తి చేయించారు. అధికారుల ఒత్తిడితో అప్పులు చేసి మరీ నిర్మాణాలు పూర్తి చేశారు. వీటికి నిధుల కేటాయింపు ఉన్నప్పటికి ముందే నిర్మాణ పనులు పూర్తి చేశారు. నిర్మాణాలు పూర్తి చేసి ఏడాది గడుస్తున్నా పలు పనులకు సంబంధించి నిధులు రాకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో పంచాయతీలో కనీసం రూ.10 లక్షలకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. నిధుల కేటాయింపులు చేయాలని పలు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

రైతులను ఆదుకుంటాం

గాంధారి: అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఆయన గండివేట్‌లో సహకార సంఘం నూతన భవనానికి డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ శంకర్ నాయక్, ముధోల్లి సింగిల్ విండో చైర్మన్ సాయిరాంతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గాంధారి వ్యవసాయ మార్కెట్ యార్డులలో తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, ఏఎంసీ చైర్మన్ సత్యంరావు, గండివేట్, గాంధారి సర్పంచ్‌లు ఫారూఖ్, సంజీవు తదితరులు పాల్గొన్నారు.



సహకార సంఘం భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్, డీసీసీబీ చైర్మన్

సీఎం కప్ సాధించాలి

రామారెడ్డి: రాష్ట్రస్థాయి క్రీడల్లో సీఎం కప్ సాధించాలని అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆకాంక్షించారు. సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన ఎంపీపీ దశరథ్ రెడ్డి, సర్పంచ్‌సంజీవ్‌తో కలిసి క్రీడలను ప్రారంభించారు. పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టి సీఎం కప్పు అందుకోవాలని కోరారు.



రామారెడ్డిలో అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జట్టును కోచ్ షకీల్, మహమూద్, రహీం అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడలు హైదరాబాద్‌లో 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఎల్లారెడ్డిరూరల్: సీఎం కప్‌లో జిల్లా స్థాయిలో హ్యాండ్‌బాల్ పోటీలో ఎల్లారెడ్డి జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని పీడీ సతీష్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీలో స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.



సదాశివనగర్: రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్టు



ఎల్లారెడ్డి: జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్టు

జీలుగ విత్తనాలు పంపిణీ

ఎల్లారెడ్డి: ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసిన జీలుగ విత్తనాలను ఎల్లారెడ్డిలో సొసైటీ చైర్మెన్ నర్సింలు, మత్తమాలలో డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వెల్లుట్లలో చైర్మెన్ సాయిలు రైతులకు పంపిణీ చేశారు. రూ. 1,564 విలువ చేసే 30 కిలోల విత్తనాలు సబ్సిడీపై రూ. 843 విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కాశి నారాయణ, నాయకులు జలందర్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మెన్ నర్సింలు

పంపిణీకి సిద్ధంగా జీలుగ విత్తనాలు

లింగంపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు పంపిణీకి అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకరావాలని సూచించారు.

మాల్తుమ్మెద సొసైటీలో..

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద సొసైటీలో మంగళవారం రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు సొసైటీ సీఈవో పవన్ తెలిపారు. 65 శాతం సబ్సిడీతో జీలుగు విత్తనాలు అందజేస్తామని పేర్కొన్నారు.

పారిశుధ్యంతో ఆరోగ్య పరిరక్షణ

ఎల్లారెడ్డి: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఎంపీవో ప్రకాష్, కౌన్సిలర్ విజయలక్ష్మి సూచించారు. పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. మండలంలోని రుద్రారంలో చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపీవో ప్రకాష్ పరిశీలించారు.

భిక్కనూరు: ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీవో ప్రవీన్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, అయ్యవారి పల్లి గ్రామాల్లో చేపట్టిన సంపూర్ణ పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రజలు కూడా సహకరించాలని అన్నారు.

పిట్లం: పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి బ్రహ్మం పేర్కొన్నారు. మండలంలోని బొల్లక్‌పల్లి, మద్దెల్‌చెరు, రాంపూర్, పిట్లం తదితర గ్రామ పంచాయతీల పరిధిలతో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు.

అంబులెన్స్ వితరణ

బీబీపేట: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి తరలించేందుకు వీలుగా బీబీపేటకు చెందిన వ్యాపారవేత్త పెరమాండ్ల తన తల్లి సువర్ణమ్మ జ్ఞాపకార్థం రూ.10 లక్షల విలువ చేసే అంబులెన్స్‌ను సోమవారం ఉచితంగా అందజేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెరమాండ్ల మాట్లాడుతూ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. అంబులెన్స్ కామారెడ్డి నుంచి వచ్చే వరకు బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించి అంబులెన్స్‌ను మండలానికి అందజేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కోసం 90002 33396 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బూత్ జోడో.. యూత్ జోడో విజయవంతం కావాలి



కామారెడ్డి టౌన్: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బూత్ జోడో యూత్ జూడో సమీక్ష సమావేశాన్ని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఐరెని సందీప్ అధ్యక్షతన సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యూత్ జోడో బూత్ జోడో రాష్ట్ర ఇన్‌ఛార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో బూత్ స్థాయి వరకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలను తయారు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, నాయకులు చందు, బత్తుల కిషన్, ఆశబోయిన శ్రీనివాస్, అంకం కృష్టారావు, కడెం ప్రవీణ్, షాదాబ్, శ్రీధర్, ప్రవీణ్ రెడ్డి, భరత్,శంకర్, సర్వర్, జగదీష్, పండ్ల అనిల్ పాల్గొన్నారు.

వారంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి



మాట్లాడుతున్న బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్

నిజాంసాగర్: ధాన్యం కొనుగోలు ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి చేయాలని బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సొసైటీ సీఈవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యం బస్తాల తరలింపు కోసం అవసరమైన లారీలను పంపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం కొనుగోలు తో పాటు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్ నారాయణ, సీనియర్ అసిస్టెంట్ బాను, సొసైటీల సీఈవోలు సంగమేశ్వర్‌గౌడ్, సాయిలు, రామన్న సేట్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్

నిజాంసాగర్: కంటి సమస్యలతో బాధపడుతున్నవారు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముగ్దుంపూర్ సర్పంచ్ బీమన్‌పల్లి లక్ష్మినారాయణ సూచించారు. సోమవారం ఆయన ముగ్దుంపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

తాడ్వాయి: మండలంలోని బ్రహ్మాజివాడిలో సర్పంచ్ జ్యోతి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్య ఉన్న నిరుపేదలను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడమే కాకుండా ప్రభుత్వం కంటి అద్దాలను పంపిణీ చేస్తుందన్నారు.

భాగ్యరెడ్డి వర్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

బాన్సువాడ: సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం బాన్సువాడలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ గౌరవ అధ్యక్షుడు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ జోగిని, దేవాదాసి వ్యవస్థల రద్దు కోసం పోరాటం చేసి దళిత బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయించిన మహోన్నతమైన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. అంబేద్కర్, జ్యోతిరావు పూలే స్ఫూర్తితో దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించారని అన్నారు. భాగ్యరెడ్డి వర్మ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు సాయిరాం, బంగారు రవి, గంగాధర్, సాయిలు, బాలకృష్ణ, గోవర్దన్ తదితరులు ఉన్నారు.



బాన్సువాడలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అయ్యాల సంతోష్ తదితరులు

పరీక్ష రద్దు చేయాలి



రాజంపేటలో డాక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

నిజాంసాగర్: ఆశావర్కర్లకు నిర్వహించ తలపెట్టిన పరీక్షను రద్దు చేయాలని సీఐటీయూ జోన్ కన్వీనర్ సురేశ్‌గొండ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌కు ఆశా వర్కర్లతో కలిసి ఆయన వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు.



జుక్కల్‌లో..

రాజంపేట: ఆశా వర్కర్లకు ఆన్‌లైన్ ఎగ్జామ్ రద్దు చేయాలని కోరుతూ ఆశావర్కర్లు స్థానిక మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ఆశావర్కర్లకు రూ. 18 వేల వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు: మండలంలోని ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ నుంచి వెదజల్లుతున్న విష పదార్థాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో సోమవారం ఫిర్యాదు చేశారు. విషపదార్థాల వల్ల కలిగే ఇబ్బందుల గురించి పలు ల్యాబ్‌లు అందజేసిన నివేదికలను వారు ప్రభుత్వ విప్ గోవర్ధన్‌కు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మహిపాల్‌తో పాటు గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు రాము,నర్సింలు, శివరాజు తిర్మల్‌రెడ్డి,అనిల్, లక్ష్మినర్సింలు, భరత్, రాము, సురేశ్, రాజు పాల్గొన్నారు.

28వ రోజుకు చేరిన దీక్షలు..

ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కూర్చున్న యాదవ సంఘం సభ్యులకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.



గంప గోవర్ధన్‌కు వినతిపత్రం ఇస్తున్న వీడీసీ సభ్యులు

గంగపుత్ర సంఘం కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ గంగపుత్ర (బెస్త) సంఘం అధ్యక్షుడుగా పంపరి విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడుగా కె.ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కేపీ అనిల్‌కుమార్, కోశా ధికారిగా కైరంకొండ రాము, ఉపాధ్యక్షులుగా కుంట నర్సింలు, బి.శ్యాంరావు, ఎ.ప్రభాకర్, కె.సిద్ధిరాములను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉప కార్యదర్శులుగా పాక రాజేశ్వర్, బి.రాజలింగం, పి.శ్రీనివాస్, కె.నవీన్, ఆడిటర్లుగా పాక రాజగోపాల్, ఎ.ఎల్లేష్, సభ్యులుగా పి. రవిప్రసాద్, పి.వెంకటి, ఎస్.బాలకిషన్, ఎ.గణేష్, పి.గంగయ్య, పి.లక్ష్మణ్, పి.దేవరాజు, న్యాయ సలహాదారులుగా పాక సాయి సంతోష్ ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మికం

■ **ఉత్సవాలకు రావాలని విప్‌నకు ఆహ్వానం**



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద బజార్ పురాతన హన్‌మాన్ ఆలయ పునర్నిర్మాణ మహోత్సవ ఉత్సవాలకు హాజరు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను కలిసి ఆహ్వానించారు. మంగళవారం అధివాస సంస్కారం, బుధవారం ప్రతిష్ఠాపన ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

■ **16 నుంచి ఊరదమ్మ పండుగ**

భిక్కనూరు: మండల కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఊరదమ్మ పండగకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ తున్కి వేణు కోరారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అన్ని కుల సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమై చర్చించారు. జూన్ 16 నుంచి 18వ తేదీ వరకు పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. పండుగ సందర్భంగా ఎవరూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని తీర్మానించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ బోడ నరేశ్, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, మాజీ సర్పంచ్‌లు బండి రాములు, నాగభూషణంగౌడ్, తులసీ మైపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు దుంపల మోహన్‌రెడ్డి, అందే దయాకర్‌రెడ్డి, కుల సంఘాల నేతలు పుర్ర రాజిరెడ్డి, బల్యాల సుదర్శన్, బల్యాల నర్సింలు, పబ్బ నాగరాజు, గంగెళ్లి మదుసూధన్, చీకోటి నాగభూషణం, శనిశెట్టి శ్రీనివాస్, సాయిలు, గంగయ్య, రాములు, సిద్దరాములు, నర్సింలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి



పిట్లం: ప్రతి ఒక్కరు ఇళ్ల వద్ద వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొవాలని మండల పంచాయతీ అధికారి బ్రహ్మం పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి సునీతతో కలిసి ఆయన సోమవారం మండలంలోని బండపల్లి గ్రామంలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణపనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 12 వేలు మంజూరు చేస్తుందన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



నిజాంసాగర్: నల్లపోచమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ఒడ్డేపల్లి గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చారు. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు.

శివాజీ విగ్రహం కోసం స్థలం కేటాయించండి



బీబీపేట: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని సోమవారం ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరమాండ్ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు.

పీహెచ్‌సీ సబ్‌సెంటర్ భవనానికి భూమి పూజ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో సోమవారం సర్పంచ్ నాగరాజు పీహెచ్‌సీ సబ్ సెంటర్ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న సబ్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సురేందర్ నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు ఏవీ?



మద్నూర్: మండల కేంద్రమైన మద్నూర్‌లో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ నియోజికవర్గ ఇంచార్జీ నాగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు మరికొందరు సోమవారం తహసీల్దార్ అనిల్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సాయిలు, గౌతమ్, మారుతి, శాంతాబాయి, నాందేవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



కామారెడ్డి టౌన్: సీడీసీ చైర్మన్‌గా ఎన్నికైన ఐరెని నర్సయ్య సోమవారం స్థానిక సీడీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మోతె ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ తీగల తిరుమల్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ గంగ్ర మధుసూదన్ రావు, సింగిల్ విండో చైర్మన్ మధు, నాయకులు బత్తిని సిద్దరాములు, మోతే మహిపాల్ రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేయాలి

కామారెడ్డి అర్బన్: సదాశివనగర్ మండలం లింగంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు సోమవారం కలెక్టర్, జిల్లా మత్స్య శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్తం

ఉర్దూ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

బిచ్కుంద: ఇంటర్ ఉర్దూ మీడియంలో అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని మండల కోఆప్షన్ సభ్యుడు జావిద్, ప్రిన్సిపాల్ తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో బిచ్కుందలోనే ఉర్దూ మీడియం కళాశాల ఉందన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

సదాశివనగర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి కోరారు. వచ్చే నెల 2న యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా నిర్వహిస్తున్న క్విజ్ పోటీలో అందరు పాల్గొనాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రతి నియోజకవర్గానికి ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్‌లతో పాటు 40 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఎంఎస్ పొందడానికి 76618 99899కి నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిరూరల్: వెల్లుట్లపేట గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలకు ఉప సర్పంచ్ వినోద భూమిపూజ చేశారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

ఎల్లారెడ్డి: మల్లయ్యపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గణపతి, పెద్దరాజు భీముడు, బాలి పెద్దమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు సర్పంచ్ ఎల్లయ్య తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్: దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కోనారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని చిన్నతక్కడ్‌పల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగహన నిర్వహించారు.

చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డి: లింగంపేట మండలానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

రేషన్ డీలర్ల సమ్మె నోటీస్

మద్నూర్: ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే జూన్ 5వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని రేషన్ డీలర్లు సోమవారం తహసీల్దార్ అనిల్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. కార్యక్రమంలో డీలర్లు జగదీశ్, రమేశ్ దేశాయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రాజంపేట: మండలంలోని అరగొండ గ్రామానికి చెందిన వంకాయల నర్సింలు సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఆయన ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దవాఖానా ప్రారంభం

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ గ్రామంలో సోమవారం జెడ్పీటీసీ పద్మాగోపాల్‌రెడ్డి, సర్పంచ్ కుమ్మరి రాజమణి పల్లె దవాఖానాను ప్రారంభించారు. పల్లె దవాఖాన ద్వారా గ్రామస్తులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన

బాన్సువాడ రూరల్: కొత్తాబాదిలో నూతనంగా నిర్మించిన జగదాంబమాత, సేవాలాల్ మందిరాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పూజలు చేశారు.